

తస్మాత్ జాగ్రత్త..

- వాట్సప్‌లో ఫేక్ లింకులు పంపుతున్న సైబర్ కేటుగాళ్లు
- క్లిక్ చేస్తే చాలు హ్యాక్ అవుతున్న సెల్ ఫోన్లు
- డబ్బులు కావాలంటూ మెసేజ్‌లు పంపిస్తున్న వైనం



కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): రోజురోజుకు సైబర్ నేరగాళ్ల కేసులు పెరిగి పోతున్నాయి. వీరి ఉచ్చులో పడేందుకు కొంత పంథాలను ఏర్పాటు చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా రైతు కిసాన్, ఎస్‌బీఐ పేరిట అందరికి జిల్లాలోని వివిధ వాట్సప్ గ్రూపుల్లో లింకులను పంపించారు. ఈ లింక్‌ను క్లిక్ చేయగానే సంబంధిత వ్యక్తుల ఫోన్లు హ్యాక్ అయ్యాయి. అనంతరం వాట్సాప్, ఫేస్‌బుక్‌లో నాకు అత్యవసరంగా డబ్బులున్నాయని, వెంటనే డబ్బులు పే చేయా లంటూ అందరికి మెసేజ్‌లు పంపించారు. జిల్లా పోలీసులు ఈ విషయంలో అందరికి అవగాహన సదస్సులు పెట్టారు. తాజాగా కాగజ్‌నగర్‌కు చెందిన ప్రముఖ డాక్టర్‌కు చెందిన సెల్ ఫోన్ కూడా హ్యాక్ చేసి ఇదే తరహాలో మెసెజ్‌లు పెట్టారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని అందరికి అవగాహన కల్పిస్తున్నా కూడా అడపాదడపా సంఘటనలు జరుగుతునే ఉన్నాయి. అయితే బయట చెప్పుకుంటే తమ పరువు పోతోందని కొంత మంది ఏ మాత్రం లీకు చేయటం లేదు. పోనీలే అనుకొని కొత్త సిమ్‌లను మార్చుకుంటున్నా రు. అలాగే ఫేస్‌బుక్ ఐడీలను కూడా మార్చే సుకుంటున్నారు. పది రోజుల క్రితం కాగజ్‌నగర్ పట్టణానికి రైల్వే అధికారికి అన్‌లైన్ సైట్‌ను క్లిక్ చేయగానే ఫోన్ హ్యాక్ అయింది. వెంటనే సంబంధిత వ్యక్తులకు వాట్సప్‌లో బ్యాంకు సాఫ్ట్‌వేర్ ను కూడా పంపించారు. వాట్సాప్‌కు సంబంధించిన డీపీని కూడా మార్చేశారు. ఈ విషయంలో కొంత మంది దగ్గరి సంబంధికులు నేరుగా ఆ అధికారి ఫోన్ చేసి ఈ విషయాన్ని చెప్పారు. వెంటనే సంబంధిత అధికారి తేరుకొని బ్యాంకు సంబంధించిన లావాదేవీలను నిలుపుదల చేసుకోవాల్సి వచ్చింది. ఈ అధికారికి సంబంధించి వాట్సప్ గ్రూపుల్లో పూర్తిగా ఎస్‌బీఐ సాఫ్ట్ వేర్ అప్‌డేట్ చేసుకోవాలంటూ మెసేజ్‌లు పెట్టడం విశేషం.

కొత్త ఆఫర్లతో..

ఇటీవల దీపావళి పండుగ పూట అంటూ ఆన్‌లైన్‌లో ఫేక్‌సైట్లు పుట్టుకొచ్చాయి. తక్కువ ధరలకే సెల్ ఫోన్ లభిస్తున్నట్లు ప్రకటనలు చేశారు. దీన్ని చూసి బుక్ చేసుకొని ఆన్‌లైన్‌లో పేమేంటు చేసిన తర్వాత సంబంధిత కంపెనీ నుంచి మెసేజ్‌లు రాకపోవడంతో అనుమానం వచ్చిన సంబంధిత వ్యాపారి నేరుగా ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానం వచ్చింది. ఈ విషయంలో తాను మోసపోయినట్టు తెలుసుకున్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త పంథా ఎంచుకొని రోజు రోజుకు మోసం చేసేందుకు అంతా సిద్దమవుతు న్నారు. కొత్త ఆఫ ర్లతో వచ్చే ఆన్‌లైన్ సైట్లను ఎవరు కూడా ఓపెన్ చేయరాదని సైబర్ నిపుణులు చెబుతున్నారు. అలాగే పీఎం కిసాన్, ఆయా బ్యాంకుల సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అంటూ వచ్చే వాటి విషయంలో పూర్తిగా ముట్టకుండా ఉండడమే ఉత్తమని సూచిస్తున్నారు.

క్రెడిట్ కార్డుల విషయంలోనూ..

క్రెడిట్ కార్డులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకు న్న వారికి బ్యాంకు ప్రతినిధులమని మీకు ఓటీపీ వస్తోందని చెప్పి ఆన్‌లైన్‌లో డబ్బులను దోచుకుంటున్నారు. మూడు నెలల క్రితం కూడా పట్టణానికి చెందిన చిరు వ్యాపారికి మీకు క్రెడిట్ కార్డు ఉందని, అప్‌డేట్ చేస్తున్నామని, మీకు ఓటీపీ వస్తోందని చెప్పి ఏకంగా రూ.90వేలు షాపింగ్ మాల్‌లో డబ్బులు చెల్లింపులు చేసుకొని దోచుకు న్నారు. అలాగే గత రెండు నెలల క్రితం కూడా సర్‌సిల్క్‌కు చెందిన ఓ ఉద్యోగికి సంబంధించిన క్రికెట్ కార్డులో ఏకంగా రూ.70వేలు దోచుకున్నారు. అలాగే చిరు వ్యాపారికి సంబంధించిన క్రిడిట్ కార్డులో కూడా ఇదే తరహాలో డబ్బులు రూ.70 వేలు కొట్టేశారు. క్రెడిట్ కార్డుల వివరాలు ఎవరికి కూడా చెప్పరాదని నిపుణులు పేర్కొంటున్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్నాం..

- వహీదోద్దీన్, డీఎస్పీ, కాగజ్‌నగర్



ఆన్‌లైన్ మోసాలపై అన్ని కళాశాలలో విద్యా ర్థులకు, బస్టాండు, రైల్వే స్టేషన్‌లో అవగాహన కార్యక్రమాలు పెడుతున్నాం. బ్యాంకుకు సంబంధిం చిన అధికారులు ఎవరు కూడా ఫోన్లు చేయరని పదే పదే చెబుతూ వివరిస్తున్నాం. అయినా కొంత మంది తప్పుడు సైట్‌ను క్లిక్ చేస్తున్నారు. క్రెడిట్ కార్డుల విషయంలో ఎలాంటి సమాచారం ఇవ్వకూ డదు. సమాచారం ఇస్తే ఆన్‌లైన్ చెల్లింపులు జరిగి డబ్బు పోగొట్టుకునే అవకాశం ఉంటుంది. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

మీ ఓటు ఉందా..లేదా..?

- టీఎస్ఈసీ వెబ్‌సైట్‌లో చూసుకునే అవకాశం

వాంకిడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందే తమ ఓటు ఉందోలేదో ఒకసారి సరి చూసుకుంటే ఇబ్బం దులు ఉండవు.. టీఎస్ఈసీ వెబ్‌సైట్‌లోకి వెళ్లిమొత్తం జాబితా పరిశీలించవచ్చు. లేదా ఎపిక్ నంబర్ ఆధారంగా ఓటరు వివరాలు ఆరా తీయడానికి అవకాశం ఉంది. ముందుగా టీఎస్ఈసీ వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో టీఎస్ఈసీ. గౌట్. ఇన్ ను క్లిక్ చేయాలి. అప్పుడు ఫైనల్ రోల్ వార్డ్‌వైజ్ ఓటర్ లిస్ట్ ఆజ్ ఆన్ 02. 09. 2025 కనిపిస్తుంది. రానిని క్లిక్ చేయాలి. అప్పుడు తెలంగాణ స్టేట్ ఎలక్షన్ కమిషన్ రూరల్ ఎలక్షన్-2025 పేజీ తెరుచుకుం టుంది. దాంట్లో జిల్లా. మండలం, గ్రామం వివరాలను పూరించాలి. పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల వివరాలు కూడా అడుగుతుంది. పైన పేర్కొన్న వివరాలు పూరించిన వెంటనే ఆయా గ్రామాల్లోని వార్డులు, దర్శనమిస్తాయి. సదరు ఓటరు ఏ వార్డు పరిధిలో ఉంటే ఆ వార్డు పేజీని ఓపెన్ చేయాలి. వార్డు పరిధిలోమొత్తం ఎంత మంది ఓటర్లు ఉంటే వారి వివరాలు అన్ని కనిపిస్తాయి.

అపురూపం.. బంగారు వర్ణం



వర్ణం.. అందులో ఉండే అందం. ఆకర్షణ అపు రూపం.. అనిర్వచనీయం. ఏ రంగ యినా ఆలోచనలు రేకెత్తిస్తుంది. చూపరులకు ఆహ్లాదం కలిగి స్తుంది. ప్రకృతి ఎన్నో వర్ణాలకు నెలవు. రుతు వును బట్టి రూపులు మారుస్తూ ఆహ్లాదం పం చడం ప్రకృతి తీరు. మండల కేంద్రంలోని పెద్దవాగు వద్ద శుక్రవారం సూర్యోదయం వేళలో మబ్బులను చీల్చుకుంటూ బంగారు వర్ణంలో లేలేత కిరణాలు పచ్చని పంట పొలాలపై పరుచుకున్న దృశ్యం ఆకట్టుకున్నది.

- పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి)

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

సిపాబాద్‌రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని అడ గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న ఇందిర మ్మ ఇళ్ల పనులను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వర్షాకాలం ముగిసినందున నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని చెప్పారు. నిర్మాణ దశల వారీగా బిల్లులు సంబంధిత లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఉచిత ఇసుకను అందిస్తుందని, అన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు ఇందిరమ్మ ఇళ్ల పనులను పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి రోజు లబ్ధిదారులతో మాట్లాడి పనుల పురోగతిని సమీక్షించాలని సూచించారు. జిల్లాలో లబ్ధిదారులకు మంజూరైన ప్రతి ఇందిరమ్మ ఇంటి పనులు మొదలు పెట్టే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.. ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న తెలంగాణ స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్ (టీస్వాన్) ఉద్యోగుల పెండింగ్ వేతనాలు ఇప్పిం చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కోరారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం వేతనాలు ఇప్పించేలా చుడాలని కోరుతూ టీస్వాన్ ఉద్యోగులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం టీస్వాన్ ప్రాజెక్టును టెండర్లలో భాగంగా హైదరాబాద్‌లోని అక్షర ఎంటర్‌ప్రైజెస్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం దక్కించుకుందని చెప్పారు. జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల్లో నెట్‌వర్క్, ఇంటర్నెట్ ఆధారిత సాంకేతిక నిపుణులుగా తమను ఉద్యోగులుగా నియమించారని తెలిపారు. ఐదు నెలలుగా తమకు వేతనాలు యాజమాన్యం చెల్లించడంలేదని చెప్పారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఈ విషయంపై యాజమాన్యంను వెళ్లి అడుగగా ప్రభుత్వం తమకు బడ్జెట్ ఇవ్వడంలేదని దీంతో వేతనాలు చెల్లించడం నిలిపి వేశామని బదులు ఇచ్చినట్లు తెలిపారు. సంబంధి తశాఖల అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందు కు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో టీస్వాన్ నాయకులు ప్రశాంత్, శ్రీధర్, లక్ష్మణ్, వ్యాసమూర్తి ఉన్నారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్ పంపిణీ

చింతలమానేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బా గ్రామంలో ఎస్ఆర్ఎస్ యూత్ వెల్ఫేర సోసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడాకారులకు యువకులకు యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణయాదవ్, సంతోష్, రవి, లక్ష్మణ్‌గౌడ్, శంకర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు

కాగజ్‌నగర్ , అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలని శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఇద్దరు కార్మికులు అనారోగ్యం పాలైతే కాగజ్ నగర్ ఈఎస్ఐ ఆసుపత్రికి తీసుకెళ్లామని అన్నారు. మున్సిపల్ నుంచి ఈఎస్ఐ కార్పొరేషన్‌కు డబ్బులు చెల్లించలేదని, హైదరాబాద్‌కు రెఫర్ చేయడం కుదరని చెబుతున్నారని చెప్పారు. కేవలం అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ సమస్య ఏర్పడిందని తెలిపారు. కార్మికులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రాజేందర్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ కార్పొరేషన్‌కు డబ్బులు ప్రతి నెల చెల్లిస్తున్నామని, జనవరి నుంచి రెఫర్ కేసులు అప్రూవల్ అవుతాయని తెలిపారు. అప్పటి వరకు ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

కెరమెరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బాలు(45) గురువారం రాత్రి తన దుకాణంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి స్వస్థలం ఇంద్రవెల్లి మండలం సాత్వాజిగూడ. మూడేళ్లుగా కెరమెరిలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. మృతుడి సోదరుడు పాండురంగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మధుకర్ తెలిపారు

మండలంలో గ్రామసభలు



గ్రామసభలో పాల్గొన్న అధికారులు

బెజ్జూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లో పనులు కల్పించడానికి గాను నేడు బెజ్జూరు మండలంలోని బారెగూడ, అంబాఘాట్, కుకుడ, లంబాడీగూడ గ్రామ పంచాయతీల్లో లేబర్ బడ్జెట్, మొదటి ప్రణాళిక తయారీకి మొదటి గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏపీవో రాజన్న, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రజినీకాంత్, కార్యదర్శులు కృష్ణమాచారి, తపన్, గురుదాస్, కవిత, టీఏలు మురళీ, రాజేష్, విజయ్, ఆశిష్, చాంద్, ఎఫ్ఏలు నారాయణ, దాస్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం దృష్ట్యా జిల్లాలో చేపట్టిన ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం ఎంపీడీవో ఎంపీవో, ఎంఈవో, సహాయ ప్రాజెక్టు అధికారులు, సహాయ ప్రోగ్రాం మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సదరం యూడీఐడీ, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి, ఉపాధి హామీ పథకం పనులు, పేరెంట్స్ కమిటీ సమావేశాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులు ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. సదరం శిబిరాల ద్వారా అర్హత కలిగిన దివ్యాంగులకు యూడీఐడీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని చెప్పారు. నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. త్వరగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకునే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం చేపట్టిన మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. పాఠశాలల్లో నిర్వహించే సమావేశాల్లో తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ విద్యార్థులు చదువులో రాణించే విధంగా చూడాలని తెలిపారు. సమావేశంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై గొడ్డలితో దాడి.. తీవ్ర గాయాలు

పెంచికలపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గపల్లి గ్రామంలో ఓ వృద్ధుడిపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గొడ్డలితో శుక్రవారం దాడి చేశాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నే బాపు తన కిరాణా దుకాణం వద్ద సాయంత్రం ఉండగా అదే గ్రామానికి చెందిన ఇస్తారి గొడ్డలితో ఒక్కసారి దాడి చేశాడు. ఈ దాడిలో వృద్ధుడి మెడ, ముఖం, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా రక్తం కారుతుండడంతో గ్రామస్థులు కాగజ్‌నగర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎస్సై అనిల్ కుమార్‌ను సంప్రదించగా గొడ్డలితో దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నామని తెలిపారు.

కుమరం భీంకు ఘన నివాళి

తిర్యాణి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలంలో కుమరం భీం వర్ధంతిని పురుస్కరించుకుని శుక్రవారం జెండా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కుమరం భీం ఆశయాల సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేష్, ఏఎస్సై నారాయణ, ఆదివాసీ నాకులు గుణవంతరావు, భగవంతరావు, శ్రీనివాస్, చంద్రశేఖర్, కమల, జగదీష్, సాగర్, రాజయ్య, శంకర్‌గౌడ్, బాదిరావు, నర్సింగ్‌రావు, సురేష్, సుభాష్, శోభన్, దశరథం, సంతోష్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

చింతలమానేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం- కోయపల్లి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు మరమ్మతు పనులను శుక్రవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నది. శుక్రవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు రోడ్డు పనులను నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో మల్లయ్య, రామన్న, రంగన్న, అంకులు, బద్రీశ్వర్, రూపేష్, నందారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి పనులకు భూమి పూజ

వాంకిడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని మండోకర్‌వాడలో మంజూరై ఇందిరమ్మ ఇంటి పనులకు శుక్రవారం కార్యదర్శి శివ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నారాయణ, జైరాం, రమేష్, బిల్ కలెక్టర్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

మురికి కూపం.. దుర్గంధ భరితం



గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపునీరు

పెంచికలపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నుంచి వెలువడే మురుగు నీరు పారాలంటే కాలువలు తప్పనిసరి. ఇళ్ల మధ్యలోనే కాదు ప్రధాన రహదారుల పైనా కాలువలు కనిపించడం లేదు. దీంతో మురుగు నీరంతా ఎక్కడిక్కడే నిలిచిపోయి దుర్గంధ భరితంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండ లంలోని దర్గపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా మురికి నీరు నిలిచి కుంటల ఏర్పడి దోమలకు నిలయంగా మారింది. గ్రామ పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు సమస్య విన్నవించినా పట్టిం చుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ముందే ఇలా ఉంటే ఈ గ్రామంలో పారిశుధ్య పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవ చ్చు. పారిశుధ్య నిర్వహణ తీరు సక్రమంగా లేకపోవడంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. వీధుల్లో ఎక్కడ చెత్త అక్కడ పేరుకు పోయి దోమలు, దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికా రుల పర్యవేక్షణ లోపం కారణంగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరిం చాలని కోరుతున్నారు.

మాజీ ఎంపీపీ కిడ్నాప్

బెల్లంపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మాజీ ఎంపీపీ గోమాస శ్రీనివాస్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం కిడ్నాప్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం బెల్లంపల్లిలోని ఏఎంసీ ఏరియాలో ఎంపీపీ గోమాస శ్రీనివాస్‌ను కొంత మంది వ్యక్తులు నెంబరు ప్లేట్‌లేని కారులో వచ్చి కిడ్నాప్ చేశారు. గతంలో ఎంపీపీ శ్రీనివాస్ కొంత మంది వ్యక్తులతో కలిసి నకిలి భూమి పత్రాలు సృష్టించి ఓ భూమిని విక్రయిస్తామని దాదాపు 50 లక్షలకుపైగా అడ్వాన్స్ తీసుకున్నారని రామకృష్ణాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. భూమికి బయాన ఇచ్చి నష్టపోయిన వ్యక్తులే ఎంపీపీని కిడ్నాప్ చేసినట్లు వదంతులు వినిపిస్తున్నాయి. కిడ్నాప్‌కు గురైన ఎంపీపీ, కిడ్నాప్ చేసిన వ్యక్తులు జన్నారం పోలీసులకు పట్టుబడ్డట్లు సమాచారం. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

సిర్పూర్(టి), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన టీఆర్ఎస్ కార్యకర్త డోంగ్రి అరుణ్ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో రూ.20 వేల నగదుతో పాటు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కుటుబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, విక్రం, ఇప్పతుస్సేన్, మోహన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై పట్టింపేది?



ఎల్కపల్లిలో డ్రైనైజీలో నిండిన పూడిక

- ఎల్కపల్లిలో దుర్గంధం వెదజల్లుతున్న వీధులు
- డ్రైనేజీల్లో నిండిన పూడిక
- పట్టించుకోని అధికారులు

బెజ్జూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మురికి కాలువల్లో పూడిక పూర్తిగా నిండిపోవడంతో మురికి నీరంతా రోడ్లపై ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామపంచాయతీల్లో పాలక వర్గాలు లేక ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా మారింది. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే నెలకొన్నాయి. మురికి కాలువల్లో పూడిక తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో మురికి నీరంతా రోడ్లపై ప్రవహించడంతో వీధులన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయని గ్రామస్తులు తెలుపుతున్నారు. దీనికితోడు దోమల వ్యాప్తి కూడా విపరీతంగా పెరిగిందని ప్రజలు వాపోతున్నారు.

పైసలు లేవు.. పనులు చేయరు..

గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనందున గ్రా మాల్లో సమస్యలు రాజ్య మేలుతున్నాయి. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదలైనా కోర్టు తీర్పు కారణంగా నిలిచిపోయాయి. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. స్థానిక సంస్థలకు ఎన్నికలకు జరిగితే గ్రామపంచాయతీలకు నిధులు వచ్చే అవకాశం ఉండేది. దీంతో పంచాయ తీల్లో పైసలు లేక ఏ చిన్న పని కూడా కావడం లేదు. కనీసం గ్రామాల్లో వీధి దీపాలు కూడా లేవు. వాటికి కూడా పైసలు లేవని కార్యదర్శులు అంటున్నారు. దీంతో తాము ఎక్కడి నుంచి తీసుకరావాలని ప్రశ్నిస్తున్నారు. విధి లేక వారు కూడా ఏం చేయలేకపోతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయని కారణంగా ఏపని చేయలేకపోతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు.



చెత్తాచెదారంతో నిండిన రోడ్డు

పేరుకుపోతున్న చెత్తాచెదారం..

రోడ్లపై చెత్త పేరుకపోయినా కనీసం అధికారులు తొలగించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో ఎన్నో రోజుల నుంచి మురికి కాలువల్లో పూడిక నిండి దుర్గంధం వస్తున్నా కనీసం వాటిపై దృష్టి సారించేవారు కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. రోడ్లపై చెత్త పేరుకపోయి రోడ్లన్ని చెత్తాచెదారంతో నిండినా గ్రామపంచాయతీ అధికారుల పట్టింపు కరువయిందని అంటున్నారు. గ్రామపంచాయతీల పదవీ కాలం పూర్తయిన నాటి నుంచి ప్రత్యేక అధికారులు గ్రామాలను సందర్శించిన దాఖలాలు లేవని తెలుపుతున్నారు. తమ గోడు ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యాలయాన్ని సందర్శించి.. సూచనలు చేసి..



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి

వాంకిడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి శుక్రవారం సందర్శించి సి బ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా వంట గది, మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని చెప్పారు. విద్యార్థుల గైర్హాజరకు గల కారణాలను వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకోవాలని తెలిపారు. పాఠశాల రికార్డులు, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించలని తెలిపారు. ప్రధాన మంత్రి శ్రీ పథకం కింద పాఠశాలలో చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని, పనుల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. విద్యార్థినులతో మాట్లాడుతూ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజనం నాణ్యత, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు పథకాలను విద్యార్థినులు సక్రమంగా వినియోగించుకోవాలని, చదువుపై శ్రద్ధ వహించాలని తెలిపారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరూ కూతుళ్లేనని..మగ సంతానం లేదని..

11 నెలల చిన్నారితో బావిలో దూకి తల్లి ఆత్మహత్య



కూతురు వేదశ్రీతో స్పందన(ఫైల్)

జన్నారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇద్దరూ కూతుళ్లేనని, మగ సంతానం లేదని మానసిక వేదనతో కుంగిపోయిన ఓ తల్లి తన 11 నెలల చిన్నారితో కలిసి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో కలకలం రేపింది. ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపిన వివరాల మేరకు మండలంలోని రేండ్ల గూడ గ్రామానికి చెందిన షట్‌పల్లి శ్రావణ్ కుమార్, జగిత్యాల జిల్లా సారంగపూర్ మండల కేంద్రానికి చెందిన స్పందన(24)కు 2020 సంవత్సరంలో వివాహం జరిగింది. శ్రావణ్‌కుమార్ 13వ బెటాలియన్ గుడిపేటలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ దంపతులకు మోక్షశ్రీ, వేదశ్రీ(11 నెలలు) కూతుర్లు పుట్టారు. అయితే వేదశ్రీ పుట్టిన నాటి నుంచి ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారంటూ స్పందన మానసికంగా కుంగిపోయింది. జీవితంపై విరక్తి పుడుతోందని, ఆత్మహత్య చేసుకుంటాను పురుగుల మందు డబ్బా కొనియ్యాలని ఇంట్లో వాళ్లని అడిగేది. దీంతో కుటుంబ సభ్యులు స్పందనను మానసిక వైద్యుడికి సైతం చూపించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో చిన్న కూతురు వేదశ్రీకి అన్నం తినిపించుకుంటూ అక్కడే తిరిగింది. అనంతరం కొద్ది సేపటికి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. సుమారు గంట తరువాత బావిలో చూడడంతో బావిలో మృతదేహాలు కనిపించడంతో వెంటనే గ్రామస్థులు మృతదేహాలను బావిలోంచి వెలికితీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.. స్పందన తల్లి బూదారపు ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హాకీలో చాంపియన్‌గా నిలవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

మందమర్రిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : హాకీ క్రీడలో కోల్ ఇండియాలో మరోసారి సత్తా చాటి బంగారు పతకం సాధించాలని ఏరియా గౌరవ క్రీడల కార్యదర్శి మాస్కుల కార్తీక్ అన్నారు. పట్టణంలో శుక్రవారం సింగరేణి పాఠశాల మైదానంలో మందమర్రి ఏరియా 61వ ఉద్యోగ వార్షిక క్రీడల్లో భాగంగా హాకీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ కంది శ్రీనివాస్‌తో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాలమేరకు ఉద్యోగులకు ప్రతి సంవత్సరం క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులు క్రీడల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. క్రీడాకారులను యాజమాన్యం ప్రోత్సహిస్తుందన్నారు. గత సంవత్సరం హాకీలో ఏరియా జట్టు బంగారం పతకం సాధించిందని, మరోసారి కోలిండియాలో బంగారు పతకం సాధించాలన్నారు. కాగా కేకే గ్రూపు, కాసిపేట గ్రూపు, ఎస్‌కె గ్రూపు జట్లు పోటీ పడగా కేకే గ్రూపు విజేతగా, కాసిపేట, ఎస్‌కె గ్రూపులు రన్నర్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శివకృష్ణ, కేకే పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వెడ్మ రాము వర్ధంతి పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం ఏదులపహాడ్‌లో ఆదివారం నిర్వహించే వెడ్మ రాము వర్ధంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు నివాసంలో ఆవిష్కరిం చారు. వర్ధంతి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, దహ్హాంతరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ర్యాలీలో పాల్గొని.. ప్రతిజ్ఞ చేయించి..

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే పాల్గొని అధికారులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, తెలంగాణ హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీ, అవగాహన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం, మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్‌లు నీలిమలతో కలిసి కలెక్టరేట్ నుంచి పట్టణంలోని బస్టాండు మీదుగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి నియంత్రణలో బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత జిల్లాగా నిర్మిద్దామని చెప్పారు. ప్రతి ఒక్కరూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటి లక్షణాలు ఉంటే వీలైనంత త్వరగా పరీక్షించుకోవాలన్నారు. సత్వర వైద్య సేవలు పొందాలని, జీవిత భాగస్వామికి కూడా పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు, యువజన సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అధికారులు

పాతది శిథిలావస్థలో.. కొత్తది అసంపూర్తిగా..



శిథిలావస్థలో మండల సమైఖ్య కార్యాలయ భవనం

దండేపల్లి అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దండేపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న శ్రీలక్ష్మీ మండల సమైఖ్య భవనం నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో ఈభవనంలో అరకొర వసతులు ఉండటంతో ఐకేపీ కార్యాలయ నిర్వహణతో పాటు మండల సమైఖ్య సమావేశాలు జరుపుతూ కాలం వెలదీస్తున్నారు. గతంలో భ వనంలో మండల పరిషత్ కార్యాలయం కొనసాగింది. ఐకేపీ కార్యాలయానికి పక్కా భవనం లేక పోవడంతో ప్రస్తుతం పాత భవనంలో ఐకేపీ కార్యాలయ నిర్వహణ కొన సాగుతోంది. ఐకేపీ కార్యాలయానికి పక్కా భవనం కోసం పదేళ్ల క్రితం దండేపల్లి పోలీసుస్టేషన్ పక్కా. సహకార సంఘం కార్యాలయం ఆనుకుని ఐకేపీ కార్యలయం, మం డల సమైఖ్య భవన నిర్మాణం చేపట్టారు. దీంతో ఈభవనం నిర్మాణం చేపట్టి పదేళ్ల దాటిన అది అసంపూర్తిగా మిగిలి ఉంది. సంబంధిత కాంట్రాక్టర్లు ఓపెన్ స్లాబ్ చేసి అర్ధాంతరంగా నిర్మాణ పనులు ఆపేశాడు. అంతే తప్ప పదేళ్లగా నుంచి ఆ భవన నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఉన్న ఐకేపీ కార్యలయ భవనంలో మండల సమైఖ్య సభ్యుల సమావేశాలు నిర్వహించడం, అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణ చేయడం ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు ఇటీవల కురిసిన బారీ వర్షాలకు నీరు కార్యాలయంలోనికి వచ్చి చేరుతుండటంతో సిబ్బంది నానా ఇబ్బందులు పడ్డారు. పైగా ఎర్తింగ్ సమస్యతో గోడలను ముట్టుకుంటే విద్యుత్ ప్రసరణ రావడంతో అందులో పని చేసే సిబ్బంది భయాందోళన చెందారు. ఈ భవనం గుర్తించి పలు మార్లు మండల సమైఖ్య సంఘం, అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య ఇంత వరకు పరిష్కరం కాలేదు. ఇప్పటికైన ప్రభుత్వంగాని, జిల్లా ఉన్నత అధికారులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి అసపూర్తిగా నిలిచిన భవనం పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టి మండల సమైఖ్య, గ్రామైఖ్య సంఘాల మహిళలు, ఐకేపీ అధికారులు, సిబ్బంది తొలగించే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న కొత్త భవనం

పది గ్రామాలకు ఊరట

రూ. 20 కోట్లతో మూడు హైలెవల్ వంతెనలు



హై లెవెల్ వంతెన నిర్మించే టేకుమట్ల వాగు

జైపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏకధాటిగా కురిసే వర్షా లతో పాటు ఎగువ నుంచి వచ్చే వరదలతో జైపూర్ మండలంలోని శెట్‌పల్లి నుంచి శివ్వారం వరకు ఉన్న పది గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పొంగిన వాగులు శాంతించే వరకు రాకపోకలు వాయిదా వేసుకునే పరిస్థితి ఉండేది. అత్యవసరం అయితే దూరమైన చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఈ కష్టాలను దూరం చేస్తూ జైపూర్ మండలంలో మూడు హై లెవెల్ వంతెనల నిర్మాణానికి మార్గం సుగమమైంది. కేంద్ర ప్రభుత్వాని కి చెందిన సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్)తో ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లాలోని పలు రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యా యి. ఇందులో మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలంలో మూ డు వంతెనలు ఉన్నాయి. సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో టేకుమట్ల-శెట్‌పల్లి మధ్య గల టేకుమట్ల వాగుపై, కుందారం ఎస్సీ కాలనీ- కిష్టాపూర్ మధ్య, కిష్టాపూర్-రొమ్మిపూర్ మధ్య గల వాగు ల మీద మూడు హైలెవెల్ వం తెనల నిర్మాణానికి ఆర్‌అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ జీవో జారీ చేశారు.

తగ్గనున్న కష్టాలు

ఎగువన కురిసిన వర్షాలతో టేకుమట్ల-శెట్ ఎల్లి మధ్య గల టేకు మట్ల వాగు విశ్వరూపం చూపిస్తుంది. ఆ సమ యంలో అత్యవసరమైన వారు జిల్లా కేంద్రా నికి వెళ్లాలంటే జైపూర్ మీదుగా రాకపోకలు సాగించాలి. దీంతో ఉపాధి నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లే వారితో పాటు ఎస్టీపీపీ, ఇతర పనులకు వెళ్లేవారికి అవస్థలు తప్పడం లేదు. వంతెనలు పూర్తయితే ప్రజల కష్టాలు తొలగిపోనున్నాయి. ఈ విషయంపై జైపూర్ ఆర్ అండ్‌బీ ఏఈ కె. శైలేందర్‌ను వివరణ కోరగ మూడు చోట్ల హై లెవెల్ వంతెనల నిర్మాణానికి అనుమతులు వచ్చాయని చెప్పారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

రేపు మెగా జాబ్‌మేళా

- సింగరేణి యాజమాన్యం ప్రత్యేక చర్యలు
- నాలుగు వేల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యం



జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు(ఫైల్)

మందమర్రిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం కోసం ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తోంది. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంది. ఈ రెండు ఏరియాలతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నిరుద్యోగులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరుతుంది. మందమర్రి జీఎం రాధాకృష్ణ జాబ్‌మేళా విజయవంతం కోసం అధికారులతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. 7వ తరగతి నుంచి మొదలుకుని పీజీ పూర్తిచేసినవారు ఈ మేళాకు హాజరై ఉద్యోగాలు సాధించాలని జీఎం కోరారు. ఐటీఐ పూర్తిచేసిన నిరుద్యోగులు సింగరేణి ఎంవీటీసీల్లో శిక్షణ పూర్తి చేసిన వారు మేళాకు హాజరు కావాలని యాజమాన్యం కోరుతుంది. కార్మికుల పిల్లలు హాజరు కావాలని గనుల, డిపార్టుమెంట్ల అధికారులు కార్మికులకు సూచిస్తు న్నారు. కేకే 5 , 1 గనులు, ఏరియా స్టోర్, సీఎస్పీ, కాసిపేట, 1, 2 గనులు, శాంతిఖని గనుల్లో జాబ్ మేళా ఫ్లెక్సీలను, పోస్టర్లను వేశారు. గత రెండు రోజుల క్రితం సింగరేణి సీఎండీ బలరాం, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ కలిసి జాబ్ మేళా పోస్టర్లను విడుదల చేశారు. పెద్ద ఎత్తున జాబ్ మేళా గురించి ప్రచారం చేయాలని సీఎండీ సూచించారు. 75 కంపెనీలు హాజరవుతారని తెలిపారు. అన్ని వసతులతో పాటు భోజన సదుపాయాలను సింగరేణి యామాన్యం ఏర్పాట్లు చేస్తుంది. బెల్లంపల్లి పట్టణంలోని ఎఎంసీ మైదానంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మేళా ఉంటుందని జీఎం తెలిపారు. రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, సింగరేణి సీఎండీ బలరాం హాజరవుతారని ఫ్లెక్సీలను, పోస్టర్లను ఏర్పాటు చేశారు. అన్ని కార్మిక సంఘాల నాయకులకు మేళా గురించి వివరించి ప్రచారం చేయాలని సూచించింది. దీంతో కార్మిక సంఘాల నాయకులు కూడా జాబ్‌మేళా గురించి వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల ద్వారా మేళా గురించి పోస్టులు చేస్తున్నారు. నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో జాబ్ మేళాకు హాజరు కావాలని జీఎం కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి



బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసీ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. 75 కంపెనీలు మేళాకు హాజరవుతున్నాయి. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి పేర్లను నమోదు చేసుకోవచ్చు. సింగ రేణి సీఎండీ ఆదేశాలతోమేళాను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నిరుద్యోగులు తప్పకుండా జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగాలు సాధించాలి.

- రాధాకృష్ణ, మందమర్రి జీఎం

రేషన్ షాపులకు జరిమానా?

మంచిర్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బియ్యం నిల్వలు మాయం చేసి, 6ఏ కేసులు ఎదుర్కొంటున్న జిల్లాలోని పలు రేషన్ షాపులకు అధికారులు భారీ జరిమానాలు విధించినట్లు తెలుస్తోంది. గత ఆరేడు నెలల క్రితం సివిల్ సప్లై అధికారులు జరిపిన తనిఖీల్లో బియ్యం నిల్వలు తక్కువగా ఉండటంతో 6ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు. అందులో భాగంగా విచారణ జరిపిన అధికారులు జిల్లా కేంద్రంలోని దొరగారి పల్లి షాపు నంబరు 3211029కు రూ. 6 లక్షలు, కాలేజీ రోడ్డులోని 321 1010 నంబరుగల షాపుకు రూ. 16 లక్ష ల పై చిలుకు, లక్షెట్టిపేటలోని 3210018 నంబరు గల షాపునకు రూ. 2 లక్షల జరిమానా విధించినట్లు సమాచారం.

రైతులకు అవగాహన

బెజ్జూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాపన్నపేట గ్రామంలో శుక్రవారం కపాస్ కిసాన్ యాప్‌పై వ్యవసాయ అధికారి నాగరాజు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు యాపలో రైతులు ఏ పంటలు వేశారో కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. రైతులంతా తమ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. ఆయన వెంట ఏఈవో మీనా ఉన్నారు.

కోతల వేళ భారీ వర్షం

నెన్నెల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దిగుబడులు చేతికొచ్చే వేళ వర్షం రావడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. చేలల్లో సేకరణకు సిద్ధంగా ఉన్న పత్తి తడిసి పోయింది. వర్షం నీటితో పత్తి రంగు మారుతుందని రైతులు చెప్పారు. వరి పొలాల్లో బురదతో హార్వెస్టర్లు నడవక కోతలు నిలిచి పోతాయని అంటున్నారు. మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

రైతులను ముంచిన అకాల వర్షం

కాసిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి మండలంలోని పత్తి, వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికి వచ్చిన పత్తి పంట కురిసిన వర్షానికి తడిసిపోయింది. వరి పొట్ట దశలో ఉండగా వర్షం వల్ల వరి నేలకొరిగింది. వర్షానికి దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కిసాన్ కపాస్ యాప్‌పై అవగాహన

కోటపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శుక్రవారం కిసాన్ కపాస్ యాప్‌పై వినియోగంపై వ్యవసాయాధికారి సాయికృష్ణరెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. పత్తి రైతులు తమ పంటను మార్కెట్ లేదా మిల్లులకు తరలించడానికి వీలుగా రూపొందించిన ఈ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునే విధానాన్ని వివరించారు. ఏఈవో వైష్ణవి, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌పట్టివేత

కోటపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. చెన్నూరు నుంచి పారుపెల్లికి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పది విద్యార్థులకు స్నాక్స్



నవంబరు నుంచి అమలుకు చర్యలు

ప్రభుత్వానికి విద్యాశాఖ ప్రతిపాదన

ప్రత్యేక తరగతులకు హాజరయ్యే వారికి అందజేత

కోటపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో పదవ తరగతి చదువుతూ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు నవంబర్ నుంచి స్నాక్స్ అందించాలని విద్యాశాఖ భావిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ ఆమోదం కోసం పాఠశాల విద్యాశాఖ కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. కొంత కాలంగా ఫిబ్రవరి 1 నుంచి 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యే వరకు సుమారు 35 నుంచి 40 రోజుల వరకు విద్యార్థులకు స్నాక్స్ అందిస్తూ వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఈ సంవత్సరం దసరా సెలవుల అనంతరమే ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి.

దీంతో ఇతర గ్రామాల విద్యార్థులు ఇళ్లకు వెళ్లే సరికి సాయంత్రం 7 గంటలు దాటు తోంది. మధ్యాహ్నం 1 గంటకు భోజనం చేసి ఇళ్లకు వెళ్లే వరకు ఏమి తినకపోవడంతో ఆకలితో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నవంబర్ నుంచే సాయంత్రం ప్రత్యేక తరగతుల సమయంలో స్నాక్స్ అందించాలని విద్యాశాఖ భావిస్తుంది. ఇదే అమలైతే విద్యార్థులకు ఆకలి బాధ తీరనుంది.

ప్రారంభమైన ప్రత్యేక తరగతులు

జిల్లా వ్యాప్తంగా అక్టోబరు 6 నుంచే ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఉదయం 8.15 గంటల నుంచి 9.15 గంటల వరకు సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. ఇందుకు సంబంధించి రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున ఏడు సబ్జెక్టులకు ప్రత్యేక తరగతుల ప్రణాళికను అధికారులు విడుదల చేశారు. దీనికి అనుగుణంగా ప్రత్యేక తరగతుల వేళల్లో ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు మరింత అవగాహన కల్పిస్తూ వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిలో మార్పు తీసుకువచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఒక్కో విద్యార్థికి రోజుకు రూ. 15

ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్‌కై ఒక్కో విద్యార్థికి రోజుకు రూ. 15 ఖర్చు చేయాలని ప్రతిపాదించారు. ఉడకబెట్టిన పెసర్లు, శనగలు లేక బబ్బర్లు, పల్లీలు, బెల్లం, చిరుధాన్యాలతో చేసిన మిల్లెట్ బిస్కట్లు, ఉల్లిపాయల పకోడి వంటివి రోజుకు ఒక్కో రకం చొప్పున విద్యార్థులకు అందజేయనున్నారు.

ఎప్పటికప్పుడు అనుమానాలను నివృత్తి చేస్తూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

విద్యార్థులకు అభ్యాస దీపికలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదవ తరగతి విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా ప్రత్యేక అభ్యాస దీపికలను విద్యాశాఖ రూపొందించింది. గణితం, భౌతిక రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘీక శాస్త్రం సబ్జెక్టులకు వీటిని రూపొందించగా ఇటీవల వీటిని విద్యార్థులకు అందించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను అభ్యాస దీపికల్లో వివరించారు.



ఉత్తమ ఫలితాల సాధన కోసం : ఎస్. యాదయ్య, డీఈవో, మంచిర్యాల



ఈ విద్యా సంవత్సరం ఉత్తమ ఫలితాల సాధన కోసం పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అందుకే ఇప్పటికే ప్రత్యేకతరగతులు ప్రారంభించాం. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వీరిలో మార్పు తెచ్చేలా చర్యలు చేపట్టాం. పాఠ్య ప్రణాళికను పక్కాగా బోధించడంతో పాటు ప్రత్యేక తరగతులను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. విద్యార్థులకు అందించే స్నాక్స్‌పై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందగానే అమలు చేస్తాం.

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై ఆశలు...

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రంలో జరిగిన సర్వేలో తేల్చారు. గోదావరి, కృష్ణ, తదితర అన్ని నదుల్లో సహజంగా జూన్ నుంచి నవంబరు వరకే వరద ఉంటుంది. ప్రాణహితలో మాత్రం ఫిబ్రవరిలో కూడా 10 వేల క్యూసెక్కుల దాకా ప్రవాహం ఉంటుంది. దీంతో తుమ్మిడిహెట్టి వైపే కాంగ్రెస్ ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. తాజాగా 150 మీటర్ల ఎత్తు కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలనే నిర్ణయానికి వచ్చింది. దీని కోసం త్వరలో మహారాష్ట్రకు వెళ్లనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల తెలిపారు. అయితే 150 మీటర్ల ఎత్తు కట్టేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలపాల్సి ఉంది. ప్రాణహిత నది అవతల గ్రామాల ముంపు, అటవీ అనుమతులు బ్యారేజీ నిర్మాణానికి సవాళ్లుగా మారనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు విషయంలో పట్టుదలతో ఉన్నందున ఉమ్మడి జిల్లాలోని రైతులకు సాగునీరందే అవకాశాలు ఉన్నాయి.

సుందిళ్లను వినియోగించడం ద్వారా...

తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో సుందిళ్ల బ్యారేజీలోకి నీటిని పంపించవచ్చని అధికారులు తాజాగా అభిప్రాయానికి వచ్చారు. నెన్నెల మండలంలోని మైలారం వద్ద పంప్ హౌస్ కట్టి ఎల్లంపల్లిలో నీటిని ఎత్తిపోయాలా..? లేక సుందిళ్లకు గ్రావిటీతో తరలించి, దాని పైననే ఉన్న ఎల్లంపల్లికి ఎత్తిపోయాలా..? అన్న దాని పై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. మైలారం గ్రామం వద్ద తవ్విన కాల్వలు, పైప్‌లైన్ల ద్వారా నీటిని సహజ సిద్ధంగా ప్రవహించే జైపూర్‌లోని రసూల్‌పల్లె వాగులో కలపడం ద్వారా అక్కడి నుంచి గోదావరిలోకి గ్రావిటీ ద్వారా తరలించే సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. గోదావరి నీటిని సుందిళ్ల బ్యారేజీకి తరలించి, అక్కడి నుంచి నేరుగా ఎగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి తక్కువ ఖర్చుతో పంపింగ్ చేసే యోచనలో ప్రభుత్వ యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విధానంలో కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయంలోని మిగతా బ్యారేజీలతో పనిలేకుండానే ఎగువకు నీరు తరలించే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. తుమ్మిడిహెట్టిని కట్టడం ద్వారా 16 లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మద్యపాన నిషేధం కోసం తీర్మానం

వేమనపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుంపుటం గ్రామంలో శుక్రవారం గ్రామస్థులందరు ఏకమై గ్రామంలో మద్యం, గుడుంబా క్రయ, విక్రయాలను నిషేధిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో ఎవరు కూడా గుడుంబా తయారు చేయరాదని, విక్రయించరాదని పేర్కొన్నారు. అలాగే బెల్టు షాపులు కూడా నిర్వహించవద్దని సూచించారు. ఒకవేళ గ్రామంలో మద్యం, గుడుంబా విక్రయాలు జరిగినట్లయితే పట్టుబడిన వ్యక్తికి రూ. 50 వేల జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఈ తీర్మాణానికి కట్టుబడి ఉంటామని గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు. తమ గ్రామంలో గుడుంబా, మద్యం నిషేధం కోసం చేస్తున్న తమకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఈ కేవైసీ చేయించుకోవాలి

కాసిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉపాధి హామీ కూలీలు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని, జాబ్‌కార్డులను రెన్యువల్‌చేసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని మల్కేపల్లి, ధర్మారావుపేట, దేవాపూర్‌పంచాయతీల్లోని ఉపాధి కూలీలు ఎక్కువ మంది ఈ కేవైసీ చేయలేదని కాబట్టి జాబ్ కార్డుకు ఈ కేవైసీ చేయించుకోకపోతే జాబ్ కార్డులోని పేర్లను సాఫ్ట్‌వేర్ ద్వారా తొలగిస్తామన్నారు. కూలీలందరు ఈ కేవైసీని నమోదు చేయించుకోవాలన్నారు.

సమస్యలను పరిష్కరించండి

తాండూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ట్రాక్టర్ యాజమానుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల తహసీల్దార్ జ్యోత్స్నకు ట్రాక్టర్ యాజమానులు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ డీజీల్, డ్రైవర్‌ల వేతనాలు పెరిగినా తాము 80 కిలో మీటర్ల దూరంలో ఉన్న నెన్నెల మండలం కర్జివాగు నుంచి ఇసుకను తీసుకువచ్చి రూ. 3300లకు అందిస్తున్నామన్నారు. కానీ కొందరు అక్రమంగా రెబ్బెన వాగు నుంచి కిష్టాపూర్ వయా రేచిని మీదుగా అక్రమంగా ఇసుకను సరఫరా చేస్తున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలన్నారు. తాండూర్ మండల ప్రజల కోసం కిరాయిని తగ్గించి ఇసుక రవాణా చేస్తున్నామని ప్రభుత్వం అనుమతి ఇస్తే తాము కూడా రెబ్బెన మండలం నుంచి రూ. 2200లకు ఇసుక రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యాజమానులు పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ

భీమారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాంపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి మధుకర్ ఇటీవల చెరువులో పడి మృతిచెందగా నామినిగా ఉన్న అతని భార్య లక్ష్మీకి రూ. 2 లక్షల బీమాచెక్కును శుక్రవారం బ్యాంకు కార్యనిర్వహణ అధికారి సుబ్బారెడ్డి అందజేశారు. అలాగే ఖాజీపల్లి గ్రామానికిచెందిన శ్రీరాముల శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందగా నామిని అయిన అతని భార్య అర్చనకు రూ. 2 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంకులోని బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు రామచంద్ర, సతీష్‌కుమార్, తేజస్వి, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

మందమర్రిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సారంగపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కమల్ మనోహర్‌రావు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజలింగు, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

మందమర్రిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, రైతులకు బ్యాంకులు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రి మండలంలోని గద్దెరాగడిలో యూనియన్ బ్యాంకు శాఖను మందమర్రి జీఎం రాధాకృష్ణతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకుకు వచ్చే ప్రజలకు అధికారులు మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రజలు యూనియన్ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటి రీజనల్ హెడ్ రాధాకృష్ణ, లీడ్ డిస్టిక్ మేనేజర్ తిరుపతి, బ్రాంచ్‌మేనేజర్ సంజీవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే... పీడీయాక్టు నమోదు చేయాలి

బెల్లంపల్లి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ఎవరైన ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే పీడీ యాక్టు నమోదు చేయాలని కోరుతూ శుక్రవారం ఎంసీపీఐయు, ఐక్యవేదిక కార్మిక సంఘాల నాయకులు సబ్‌కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. బెల్లంపల్లి పట్టణంతో పాటు మండలంలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములకు నకిలి డ్యాకుమెంట్లను సృస్టించి కబ్జాలు చేస్తున్నారని వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూముల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పట్టణంలో సింగరేణి, ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో సర్వే చేపట్టి ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూములున్న చోరట వాటికి కంచే ఏర్పాటు చేసి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణిరాంసింగ్, రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్, రమేశ్, చాంద్‌పాషా, అంబాల మహేందర్, నాయకులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

ఆయుధాల పనితీరుపై అవగాహన

బెల్లంపల్లి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీసుస్టేషన్‌లో ఓపెన్‌హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసుల విధులు, ఎదురయ్యే సవాల్లు, సాంకేతిక పరిజ్ఞానం, తుపాకుల్లో రకాలు, వినియోగం, ఆయుధాల పనితీరు గురించి విద్యార్థులకు సీఐ వివరించారు. అల్లర్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు స్వయంగా ఆయుధాలను చూసి తీక్షణగా పరిశీలించడం మంచి అనుభవంగా భావించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాకేశ్, పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నెపల్లి : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నెపల్లిలోని జెడ్పీహెచ్ఎస్, కస్తూర్బా పాఠశాలల విద్యార్థులకు ఎస్ఐ భాస్కర్‌రావు పోలీసుల విధుల నిర్వహణ, ఆయుధాల పనితీరు, ఎఫ్ఐఆర్ నమోదు, సాంకేతికత, డయల్ 100 గురించి అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసమే పోలీసులు పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావు

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నస్పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని సీసీసీ కార్నర్ వద్ద గల నర్సయ్య భవన్‌లో శుక్రవారం లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి-41, షాదీ ముబారక్-7, మొత్తం 48 మంది లబ్ధిదారులకు చెక్కులను తహసీల్దార్ సంతోష్ పంపిణీ చేశారు. ఇందులో బీసీ-33, ఎస్సీ-7, ఎస్టీ-1, మైనార్టీ-7 మంది లబ్ధిదారులున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌తో పాటు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు ప్రశాంత్, చందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ విరాళం

దండేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపేట్ ప్రాథమిక పాఠశాలకు లింగాపూర్‌కు చెందిన బోడ రాజశేఖర్(చంటి) 14 వేల రూపాయల విలువ చేసే లేజర్ ప్రింటర్‌ను అందించారు. పాఠశాల అవసరాల దృష్ట్యా ప్రింటర్ అందించినట్లు రాజశేఖర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలు చదువుతారని, వారి విద్యా అవసరాలకు ఉపయోగపడే విధంగా సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మంత్రి రాజు, కాంప్లెక్స్ హెచ్‌ఎం సుదర్శన్, హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు రామరాజు, శ్రీనివాస్, మీనాక్షి, సీఆర్‌పీ రాజ్‌మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన యువతికి సన్మానం



శ్రీజాను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

నెన్నెల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జాతీయ స్థాయి కబడ్డి పోటీలకు ఎంపికైన మైలారం గ్రామానికి చెందిన గిరిజన యువతి నాయిని శ్రీజాను గ్రామస్తులు ఘణంగా సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. మారుమూల గ్రామానికి చెందిన శ్రీజా జాతీయ స్థాయికి ఎదగడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న శ్రీజా ప్రస్తుతం బెల్లంపల్లిలో ఇంటర్ చదువుతోంది. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఆ పోటీల్లో సైతం రాణించి జిల్లాకు, గ్రామానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు అంగలి శేఖర్, బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్‌సాగర్, ఆదివాసి సంఘం నాయకులు జంబి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

జైపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీ నుంచి ఇల్లెందు ఏరియాకు బదిలీపై వెళ్తున్న డీజీఎం (ఐఈడీ) ప్రభాకర్‌రావును శుక్రవారం ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఆయన విధి నిర్వహణలో చేసిన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసింహరావు, అధికారులు మదన్ మోహన్, సత్యనారాయణ, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, అజాజుల్లాఖాన్, వేణుగోపాల్, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా మైదానాలు

- లక్షల రూపాయల ప్రజాధనం వృధా
- కనిపించని పరికరాలు
- పిచ్చి మొక్కలు పెరిగి మట్టి దిబ్బలతో దర్శనం

భీమిని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో యువతి, యువకుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. కానీ వాటిని వినియోగంలోకి తీసుకరావడంపై దృష్టి సారించకపోవడంతో మైదానాలు నిరుపయోగంగా మారాయి. క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే సకల్పం ఉన్న యువతకు నిరాశే మిగులుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి క్రీడా ప్రాంగణాలను అందుబాటులోనికి తేవాలని క్రీడాకారులు, స్థానికులు కోరుతున్నారు.

● ప్రజాధనం వృధా

మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం గ్రామాల్లో వివిధ ప్రాంతాల్లో లక్షల రూపాయల వెచ్చించి క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. ఇందుకు గాను జాతీయ ఉపాధిహామీ నిధుల నుంచి ఒక్కో ప్రాంగణానికి సుమారు లక్షలకు పైగా నిధులతో నిర్మాణాలు చేపట్టింది. కానీ వాటి నిర్వహణపై అధికారులు దృష్టిసారించక పోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో చాలా చోట్ల మైదానాలు చదును చేయకపోగా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. కొన్నింటికి సరైన రహదారి సైతం లేదు. ప్రజాధనం వృధా చేయడంపై ప్రజలు, యువత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రాంపూర్ గ్రామంలో బోర్డు లేని క్రీడామైదానం

● నిండుకున్న పిచ్చిమొక్కలు..

కానరాని క్రీడా సామగ్రి..

క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటూ ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలోని యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో క్రీడా సామగ్రిని కూడా సమకూర్చారు. క్రికెట్ కిట్లు, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాట్మింటన్, టెన్నికాయిట్ వంటి క్రీడా సామగ్రి కిట్లు గ్రామ పంచాయతీలకు అందించారు. కాని వాటిని వినియోగంలోకి తీసుకరాకపోవడంతో అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. క్రీడా సామగ్రి అందుబాటులో ఉంచి వారిని పోత్సహించాలని యువతతో పాటు పలువురు కోరుతున్నారు.



ఊరికి దూరంగా అక్కలపల్లి క్రీడా మైదానం

● మందుబాబులకు అడ్డాగా...

లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన క్రీడా ప్రాంగణాలు చివరికి మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. క్రీడా ప్రాంగణాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. క్రీడా మైదాలనాలకు ప్రహరీ లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ఇద్దరూ కూతుళ్లేనని... మగ సంతానం లేదని
11 నెలల చిన్నారితో బావిలో దూకి తల్లి ఆత్మహత్య 6

పది విద్యార్థులకు స్నాక్స్
నవంబరు నుంచి అమలుకు చర్యలు
-ప్రభుత్వానికి విద్యాశాఖ ప్రతిపాదన 7

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్



మందమర్రి మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించారు. కమిషనర్ రాజలింగు, డీఈ సుమతిని అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్నపనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వార్డుల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని, సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు. అలాగే క్యాతనపల్లి మున్సిపాలిటీని కలెక్టర్ సందర్శించారు. అభివృద్ధి పనుల గురించి కమిషనర్‌రాజును అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలన్నారు. ఏమైనా శాఖపరమైన ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రజా రక్షణలో పోలీసులది ప్రముఖ పాత్ర



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వేణుచందర్

శ్రీరాంపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల రక్షణలో పోలీసులది ప్రముఖ పాత్ర అని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం(పోలీస్ ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం "ఓపెన్ హౌస్" నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, శాంతి, భద్రతలను సంరక్షించడంలో ఎంతో మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు. వారి త్యాగాలు, సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. చట్టాన్ని గౌరవించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా మోసానికి గురైతే 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాల వాడకం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని హెచ్చరించారు. బాలికలు, మహిళల రక్షణకు భరోసా కేంద్రం అందుబాటులో ఉంటుందని, సేవలు పొందవచ్చన్నారు. అనంతరం పోలీసుల విధులు, సేవలు, ప్రజా రక్షణకు తీసుకుంటున్న చర్యలు, డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన విభాగం, ఫింగర్ ప్రింట్స్, ట్రాఫిక్ పరికరాలు, డయల్ 100 ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆయుధాల వినియోగం గురించి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సంతోష్, ఇతర పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పల్లెబాట



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

చెన్నూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మెర సెక్షన్ పరిధిలోని సోమనపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ వినియోగదారులకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు వాడాలని సూచించారు. ఇంటికి ఎర్తింగ్ చేసుకోవాలని, ఫ్రిజ్‌లు, కూలర్లు ప్రతి ఒక్కదానికి ఎర్తింగ్ చేయించాలన్నారు. ఎర్తింగ్ చేసుకుంటే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. ఇంటికి నాణ్యమైన సర్వీస్ వైరు, డీపీ మెయిన్ స్విచ్ ఫ్యూజ్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ ఫిర్యాదులుంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ కేశెట్టి శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజమల్లు, లైన్‌మెన్ సురేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



నెన్నెల మండలం జంగల్‌పేట వద్ద తవ్విన ప్రాణహిత కాలువ

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై ఆశలు..

- తుమ్మిడిహెట్టిని నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- వ్యాప్కోస్ నివేదిక పునఃపరిశీలన ఆధారంగా డీపీఆర్
- సుందిళ్లకు గ్రావిటీతో నీటికి కొత్త ప్లాన్..?
- 150 మీటర్ల ఎత్తు కోసం మహారాష్ట్రతో సంప్రదింపులు


మంచిర్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తుమ్మిడిహెట్టి బ్యారేజీ ద్వారా తక్కువ ఖర్చుతో గోదావరి జలాలను ఎత్తిపోయవచ్చని ముందు నుంచీ వాదిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అందుకు అనుగుణంగా ఆ ప్రాజెక్టును నిర్మించేందుకు అడుగులు వేస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మించడం ద్వారా ఉమ్మడి జిల్లాను సశ్యశ్యామలం చేయనున్నట్లు గతేడాది పెద్దపల్లిలో జరిగిన బహిరంగ సభలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సైతం ప్రకటించారు. దీంతో తుమ్మిడిహెట్టిపై ఆశలు చిగురిస్తుండగా, ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ గతంలో చేసిన సర్వే ఫలితాలను పునః పరిశీలన చేయించే పనిలో రాష్ట్ర ప్రభుత్వం పడింది. ఆ ఫలితాల ఆధారంగా డీపీఆర్‌కు తుదిరూపు ఇచ్చి, అనుమతుల కోసం కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ)లో దాఖలు చేయాలనే ఆలోచనతో ఉంది.

గతంలో తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించాలని ప్రతిపాదించగా.. తాజాగా గ్రావిటీతో సుందిళ్ల బ్యారేజీకి నీటిని తరలించాలనే కొత్త ప్రతిపాదనను ప్రభుత్వం తెరమీదకి తెచ్చింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ప్రతిపాదిత ప్రాంతం నుంచి 71.5 కిలోమీటర్ల వరకు కాలువల నిర్మాణం కూడా గతంలోనే పూర్తయింది. ఇక బ్యారేజీ నిర్మాణమే తరువాయి అనే పరిస్థితిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హఠాత్తుగా ప్రాజెక్టును రద్దు చేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నట్లు బ్యారేజీ నిర్మాణం జరిగితే తుమ్మిడిహెట్టి నుంచి నెన్నెల మండలం మైలారం గ్రామం వరకు 71.5 కిలీమీటర్ల దూరం మోటార్ల వినియోగం లేకుండానే నీరు గ్రావిటీతో వచ్చే అవకాశాలు ఉన్నాయి. అక్కడ నుంచి తక్కువ సామర్థ్యం కలిగిన పంపుల ద్వారా ఎల్లంపల్లికి నీటిని తరలించవచ్చని గతంలో ప్రతిపాదించారు.

150 మీటర్ల ఎత్తుతో నిర్మాణం..!

ఉమ్మడి రాష్ట్రంలో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తుతో కట్టాలని ప్రతిపాదించగా..ముంపు అధికంగా ఉంటుందనే మహారాష్ట్ర అభ్యంతరాలతో పక్కన పెట్టారు. రాష్ట్రం ఏర్పడ్డ తరువాత 148 టీఎంసీ సామర్థ్యంతో ప్రాజెక్టును కడతామని మహారాష్ట్ర అప్పటి సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒప్పందం చేసుకున్నారు. దీనికి మహా రాష్ట్ర అంగీకారం తెలుపుతూ సంతకాలు చేసింది. కాళేశ్వరంతో పాటే తుమ్మిడిహెట్టిని కడతామని కేసీఆర్ ప్రకటించారు. తర్వాత తుమ్మిడిహెట్టి కాలగర్భంలో కలిసిపోయింది. వన్యప్రాణుల అభయారణ్యం, సాంకేతిక అంశాలు, నీటి లభ్యత లేదనే కారణాలతో ప్రాజెక్టును పక్కనబెట్టారు. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉందని ఉమ్మడి..

(తరువాయి 7లో)



ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రూట్ మ్యాపు

కల్వర్టుల తనిఖీ



కల్వర్టును తనిఖీ చేస్తున్న పోలీసులు

కోటపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్జునగుట్ట నుంచి అన్నారం గ్రామం వరకు శుక్రవారం సీఐ బన్సీలాల్, ఎస్‌ఐ రాజేందర్‌ల ఆధ్వర్యంలో పోలీసులు కల్వర్టులు తనిఖీ చేశారు. అనంతరం అంతర్‌రాష్ట్ర వంతెన వద్ద వాహనాలు తనిఖీ చేశారు. మావోయిస్టులు బంద్‌కు పిలుపునివ్వడంతో భద్రత చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు.

కిసాన్ కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి

చెన్నూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పత్తిని సీసీఐ పత్తి కేంద్రాల్లో అమ్ముకోవడానికి కిసాన్ కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలంలోని సుందరసాల, ముత్తరావుపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కిసాన్ కపాస్ యాప్‌లో పత్తి బుకింగ్ కోసం రైతుల సెల్ నెంబర్లు పనిచేయ కుంటే సంబంధిత ఏఈవోలకు తెలియజేయాలన్నారు. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉండాలన్నారు. అలాగే వరిలో ఎఫ్ఏక్యూ, నార్మ్స్‌పైన అవగాహన కల్పించారు. ఏవో యామిని, ఏఈవోలు వనదేవి, సాగర్, రాజశేఖర్ , రైతులు పాల్గొన్నారు.

మంచిర్యాలవాసికి డాక్టరేట్



చైతన్య కుమారి

మంచిర్యాల క్రైం/ఆసిఫాబాద్ రూరల్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం పరిశోధకురాలు చైతన్య కుమారికి డాక్టరేట్ లభించింది. ఆమె ట్రైబల్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నా రు. యూనివర్సిటీ పరీక్షల నిర్వహణ అధి కారి ఆచార్య కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రక టించగా, ఆచార్య వల్లూరి రామచంద్రం మార్గదర్శకత్వంలో ఆమె "పబ్లిక్ పాలసీ అండ్ ట్రైబల్ వెల్ఫేర్ ఏ స్టడీ ఆఫ్ ఐటీడీఏ ప్రోగ్రాం ఇన్ ఆసిఫాబాద్-కొమురం భీం" అంశంపై తన పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. జిల్లాకు చెందిన చైతన్యకుమారికి డాక్టరేట్ రావడంతో ట్రైబల్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల సహచర అధ్యాపకులు అభినందించారు.

ద్వారక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

దండేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం నీరటి సురేష్‌కు పూర్వ విద్యార్థి అయిన రాకేష్ తన సొంత డబ్బులతో 30 వేల రూపాయలు విలువ చేసే రెండు కంప్యూటర్లు విరాళంగా ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మంత్రి రాజు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చిన్న నర్సయ్య, నీరటి సురేష్, ఉపాధ్యాయురాలు లావణ్య, పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులే

కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ నారాయణ



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ నారాయణ

మంచిర్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేశ భవిష్యత్ నిర్మాతలు నేటి విద్యార్థులేనని కాకతీయ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ అన్నారు. మంచిర్యాల నగరంలోని వివేకవర్ధిని కళాశాలలో మంచిర్యాల జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఊదారి చంద్రమోహన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్-కొమురం భీం, మంచిర్యాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే తోటివారికి సహాయపడేలా జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) 1969లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఒక మనిషికి సహకరించడం మానవతా లక్ష్యమన్నారు. పది మందికి ప్రయోజనం కలిగించేవిధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాలను దత్తత తీసుకొని స్వచ్ఛంద సేవా కార్యక్రమం నిర్వహించేలా ప్రోగ్రాం అధికారులు చొరవ చూపాలన్నారు. సంపూర్ణ అక్షరాస్యత, వయోజన విద్య, జనాభా నియంత్రణ, అంటువ్యాధులు, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జిల్లాల కన్వీనర్లు చంద్రమోహన్, తిరుపతి,అర్చన, సత్యనారాయణ, ప్రోగ్రాం అధికారులు చంద్రశేఖర్, శ్రీనివాస్, యూనివర్సిటీ సూపరింటెండెంట్ సతీష్ పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలని వినతి

కోటపల్లి, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి) : అడవి పందుల వల్ల పత్తి పంటలకు నష్టం జరిగిందని బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం డిప్యూటీ రేంజ్ అధికారిణి లావణ్య, వ్యవసాయాధి కారి సాయికృష్ణకు వినతి పత్రాలు అందించారు. కొండంపేట, నాగంపేట, ఎసన్‌వాయి, ఎడగట్ట, పిన్నారం గ్రామాల్లో అడవి పందుల వల్ల పంటలకు నష్టం వాటిల్లిందని, వెంటనే సర్వే చేసి పరిహారం అందించాల న్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ సాంబగౌడ్, నాయకులు కొట్టె నారాయణ, అజ్మీర పున్నం, బాపునాయక్, మల్లేష్ పాల్గొన్నారు.



అటవీ శాఖ అధికారిణికి వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హరితహారం ద్వారా పెంచిన మొక్కల డబ్బులు చెల్లించండి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హరితహారం మొక్కల డబ్బులు పంపిణీపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుని డబ్బులు ఇప్పించాలని కోరుతూ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో హరితహారం మొక్కలు పెంచడానికి 12 ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యుల నుంచి మొక్కలు పెంచారన్నారు. 2018- 19-20 సంవత్సరాల్లో పెంచిన మొక్కలు తీసుకున్న అధికారులు డబ్బులను ఎస్‌హెచ్‌జీ సభ్యులకు చెల్లించలేదన్నారు. 2020 సంవత్సరం డబ్బులు మాత్రమే చెల్లించారన్నారు. వెంటనే పెంచిన మొక్కలకు మొత్తం డబ్బులను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు రాజేశ్వరి, భాగ్యలక్ష్మీ, అనిత, సుజాత పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న రంజిత్‌కుమార్

విదేశాలకు జిల్లా టీచర్లు..

- బోధనపై అధ్యయనానికి ముగ్గురు ఎంపిక
- వియత్నాం, ఫిన్లాండ్, జపాన్‌లో పర్యటన
- తుది జాబితా రాష్ట్ర విద్యాశాఖకు అందజేత



బోనగిరి శ్రీనివాస్, దాముక కమలాకర్, జలాల శ్రీనివాస్

మంచిర్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో ప్రమాణాలు మెరుగు పరిచే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన మేరకు జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు విదేశీ టూర్‌కు ఎంపికయ్యారు. వేర్వేరు దేశాల్లో బోధన, సిలబస్‌లో కాలానుగుణంగా వస్తున్న మార్పులను పరిశీలించడం, ఆయా దేశాల్లో విద్యాబోధన విధానాలను అధ్యయనం చేయడానికి ఐదు రోజుల ట్రిప్పు కోసం 'ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ అండ్ విజిట్ ఎడ్యుకేషన్ ఎక్స్ఛేంజ్ ఫర్ టీచర్స్' పేరుతో వియత్నాం, ఫిన్లాండ్, జపాన్ దేశాలకు పంపేందుకు నిర్ణయించగా, ఇటీవల కలెక్టర్ నేతృత్వంలో దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. ఆయా దేశాల్లోని విద్యావ్యవస్థకు అంతర్జాతీయ గుర్తింపు ఉండటంతో పై మూడు దేశాలను ఎంపిక చేసింది. వియత్నాంలో విద్యతోపాటు సామాజిక కళలు, శారీరక విద్య, ఇంగ్లీష్ భాషపై పట్టు ఎక్కువగా ఉంటుంది. అక్కడ సాంప్రదాయ పద్ధతిలో బోధన ఉంటుంది. ఈ మధ్యకాలంలో యాక్టివ్ లెర్నింగ్ విధానాలు అనుస రిస్తున్నారు. ప్రోగ్రామ్ ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసెస్ మెంట్ (పీఐఎస్ఏ) పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఆ దేశం విద్యార్థులు సింగపూర్, జపాన్ దేశాలతో పోటీపడుతున్నారు. జపాన్‌లో ప్రాథమిక పాఠశాల స్థాయిలో బేసిక్ రీడింగ్, రైటింగ్, గణితంతోపాటు నైతిక విలువలు నేర్పిస్తారు. మధ్య పాఠశాల వ్యవస్థ (జూనియర్ హై స్కూల్)లో టీమ్ వర్క్, టైమ్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్య మిస్తున్నారు. ఉన్నత విద్య (సీనియర్ హై స్కూల్) స్థాయి లో వృత్తి విద్యా కోర్సులు ఉంటాయి. ఆధునిక రోబోటిక్ టెక్నాలజీని ప్రాథమిక విద్య నుంచే అందిస్తున్నారు. ఆయా పద్ధతులను అధ్యయనం చేయడం ద్వారా రాష్ట్రంలోనూ అమలు చేయాలన్న లక్ష్యంతో డిసెంబరులో ఉపాధ్యాయులను విదేశాలకు పంపే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఉపాధ్యాయులు ఆయా దేశాల్లో ఎంపిక చేసిన పాఠశాలలను సందర్శించాల్సి ఉంటుంది.

అక్కడి విద్యార్థులు, టీచర్లు, విద్యావేత్తల అభిప్రాయాలను తీసుకోవాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అమలు తీరు, బోధనలో డిజిటల్ విధానల మేళవింపు, విద్యార్థులను అనుసరిస్తున్న టెక్నాలజీ, స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన వంటి అంశాలను టీచర్ల బృందాలు పరిశీలిస్తాయి.

ముగ్గురు ఉపాధ్యాయుల ఎంపిక...

దరఖాస్తుల పరిశీలన, అభ్యర్థుల వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా జిల్లాకు చెందిన ముగ్గురు వివిధ కేటగరీలకు చెందిన ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 21న ముగియగా, 23న వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించారు. శుక్రవారం ఎంపికైన ఉపాధ్యాయుల పేర్లను ప్రకటించారు. ప్రధానోపాధ్యాయుల కేటగరీలో జైపూర్ మండలంలోని ఇందారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు బోనగిరి శ్రీనివాస్ ఎంపిక అయ్యారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో జన్నారం మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు దాముక కమలాకర్, ఎస్‌జీటీ కేటగిరీలో జన్నారం మండలం అక్కపెల్లిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జలాల శ్రీనివాస్ ఎంపిక అయ్యారు. విదేశీ టూర్‌కు ఎంపికైన ఉపాధ్యాయుల తుది జాబితాను రాష్ట్ర విద్యాశాఖకు పంపించారు. విదేశాలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు కేటగరీల్లో దరఖాస్తుల స్వీకరణ...

అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిట్ కోసం జిల్లా నుంచి ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ తత్సమాన స్థాయి, ఎస్‌జీటీ, తత్సమాన స్థాయి, తదితర మూడు కేటగరీల్లో దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ నేతృత్వంలో ఎంపిక చేసిన కమిటీ దరఖాస్తులను స్వీకరించగా, ఇంటర్వ్యూ ద్వారా జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఆయా విభాగాల్లో మొత్తం 17 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ప్రధానోపాధ్యాయ కేటగరీలో 2, స్కూల్ అసిస్టెంట్ కేటగరీలో 10, ఎస్‌జీటీ కేటగరీలో ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారు.